
## ప్రగతి - వనిత వినియోగదారుల కథల పోటీలో
## ప్రత్యేక బహుమతి పొందిన కథ

# అదీ సంగతి...!

- సత్యప్రసాద్



"రశీదు కావాలి..." అన్నాడతను. నేను అతనివైపు తిరిగాను. సరుకులు కొనడమన్న మాటే గానీ ఏనాడూ రశీదు తీసుకున్న పాపాన పోలేదు నేను. నేనే కాదు, ఎవరూ రశీదు విషయంలో సరైన జాగ్రత్త తీసుకోరన్నది సర్వ విదితమే...!

"రశీదా... మేము రశీదులు ఇవ్వం సార్...!" అన్నాడా కొట్టువాడు.

"రశీదు లేకపోతే నాకీ వస్తువులు వద్దు..." అన్నాడతను. నిజంగా మనం కూడా అంత ఖచ్చితంగా ఉంటే అసలు వినియోదారులకు సమస్యలే వుండవని అనిపించింది నాకు. ఆ క్షణమే అతను నన్ను ఆకర్షించాడు.

"పర్లేదు సార్... తీసుకెళ్ళండి. గ్యారంటీ సరుకే..." సముదాయించాడు వాడు.

"సరుకు ఏదైనా గానీ... నాకు మాత్రం రశీదు కావాలి అంతే... రేప్పొద్దున ఈ సరుకుల్లో ఏమైనా తేడా లొస్తే మీదగ్గర కొనలేదని బుకాయిస్తారు..."

"అబ్బే మేము అలాంటి వాళ్ళం కాదు సార్... నా మాట నమ్మండి..."

"నమ్మకమా...? అడగగానే రశీదు ఇచ్చి వుంటే నమ్మకం కలిగి వుండేది..." అంటూనే సంచిలో సరుకులు తీయబోయాడు.

"సార్... రశీదు కావాలంటే అయ్యగారు రావాలి... లేటవుతుంది..." అని నసిగాడు షాపు కుర్రాడు.

"ఫర్వాలేదు. నేను అతనొచ్చేదాకా వెయిట్ చేస్తాను..." అన్నాడు, అక్కడే వున్న బల్లమీద కూర్చుంటూ. నేను నెమ్మదిగా అతని దగ్గరకు వెళ్ళాను.

"వీళ్ళెప్పుడూ ఇంతే సార్. రశీదులు ఇవ్వరు..." అన్నాను అతనితో మాట కలుపుదామన్న ఉద్దేశ్యంతో.

"మీలాంటి వాళ్ళంతా ఇలా చూస్తూ ఊర్కోబట్టే ఇలా తయారవుతున్నారు వీళ్ళు...! ఏమైనా రశీదు తీసుకోందే ఇక్కడ్నుంచి కదలను..." అన్నాడు అతను దృఢంగా.

"అవునులెండి. మనమిలాగే గట్టిగా కూర్చుంటే అతను మాత్రం ఏం జేస్తాడు... అసలు ఈ సరుకులు చూడండి. అంతా రాళ్ళు... కల్తీ... ఇది చూడండి. నిర్మా సోప్ ఇవ్వమంటే బర్మా సోపట. అంటగట్టాడు..." అన్నాను.

"మరి ఇవన్నీ చూస్తూ ఎలా ఊరుకుంటున్నారండీ... వినియోగదారుల ఫోరంలో కేసు పెట్టక..." అన్నాడతను. ఆ మాటకి కొట్టువాడు అదిరిపడ్డాడు.

"అబ్బే... అంత దూరం ఎందుకు లెండి... ఇదిగో అయ్యగారు వచ్చేశారు... అయ్యా, వారు రశీదు అడుగుతున్నారు..." అన్నాడతను.

"రశీదా...?" వేళాకోళంగా అన్నాడు ఓనరు.

"అవును రశీదే. ఇస్తారా లేక..." అనబోతుండగా షాపులోని కుర్రాడు అందుకున్నాడు -

"అబ్బే అవన్నీ ఎందుకులెండి... అయ్యా. మీరు ముందు రశీదివ్వండి..." అన్నాడు. రశీదు తీసుకొని ఇద్దరం బయటపడ్డాం.

"ఇంతేనండీ... ఏమాత్రం అవకాశమిచ్చినా వీళ్ళు మన మెడకు బిగిస్తారు... అందుకే నేను ప్రతిచోటా ఇలాగే గట్టిగా వుంటాను..." అన్నాడతను.

"అవునవును... ఇలానే ఉండాలి... అన్నట్లు మీ పేరు..." అడిగాను.

"నా పేరు రామకృష్ణ... నిజాయితీగా వ్యాపారం చేసి నష్టపోయాను. ప్రస్తుతానికి చిన్న చిట్‌ఫండ్ కంపెనీతో కాలం గడుపుతున్నాను..." అంటూ తన వివరాలు చెప్పాడు.

ఆ రోజు నుంచీ నాకు మంచి స్నేహితుడయ్యాడతను. ఎప్పటినుంచో పరిచయం ఉన్నవాడిలాగా మాట్లాడేవాడు. అతని మాటలేకాదు, చేతలు కూడా నన్ను ఆకర్షించేవి.

చిన్న బండివాడి దగ్గర్నుంచి... సినిమా హాలు

ఓనరు దాకా అంతా అతడు పలికే 'ఫోరం' అనే చిన్న పదానికి బెదిరిపోయేవారు. తద్వారా... తను పొంద వలసిన వన్నీ పొందగలిగేవాడు.

"మనం అవకాశమిచ్చే కొద్దీ... వీళ్ళు మోసం చేస్తూనే ఉంటారు. మోసపోయేవాళ్ళు ఉంటేనే కదా మోసగాళ్ళు తయారయ్యేది? అందుకే మోసగాళ్ళను కనిపెట్టి వాళ్ళకి దూరంగా ఉండటం ఎంతో అవసరం. అది కూడా ఒక కళేనను కోండి..." అంటూ అర్జునుడికి శ్రీకృష్ణుడు ఉపదేశించినట్లు నాకు 'వినియోగ గీత' ఉపదేశించేవాడు. నాకూ ఎంతో ఆసక్తిగానే వుండేది.

అతనిలో వున్న ఒకానొక మంచి గుణం - కనపడ్డ వారినందరినీ పరిచయం చేసుకోవడం; వారితో కలుగోలుగా మాట్లాడటం. ఆ కళే అతనికి, అతని చిట్ ఫండ్ కంపెనీకి ఎంతో సహాయపడింది. అతని కంపెనీలో స్కీములు కూడా చాలా బాగుండేవి. ప్రతి నెలా లక్కీ డిప్‌లు ,ప్రతివారికీ ఏదో ఒక ప్రైజులు ఇలాంటి 'ఎట్రాక్షన్స్'తో ఎంతో ఆర్జించటం మొదలుపెట్టాడు. నేను కూడా ఓ పదివేలు దాకా రామకృష్ణ చేతిలో పెట్టాను.

ఒకరోజు నాకొక వాల్‌క్లాక్ ప్రైజ్ వచ్చిందన్నాడు. అన్నట్టుగానే మర్నాడు ఒక వాల్‌క్లాక్ తెచ్చిపెట్టాడు. ఎంతో అందంగా ఉందా క్లాక్. మా గోడల రంగుకు తగిన రంగులో ఎంచి మరీ తెచ్చాడు. ఇక ఇంటికి వచ్చిన వాళ్ళంతా నా అదృష్టానికి అభినందించారు.

వారం రోజుల తరువాత ఉదయాన్నే చూసేసరికి ఆ గడియారం ఆగిపోయింది. ఏ వస్తువు కొన్నా ఆచి తూచి కొనే రామకృష్ణ ఇచ్చిన గడియారం ఇలా ఆగిపోవడం నాకెంతో ఆశ్చర్యం కలిగించింది. ఆరోజు టిఫిన్ చేసి ఆ గడియారంతో సహా అతనింటికి బయల్దేరాను.

అతని ఇంటి ముందు చాలామంది జనం పోగై వున్నారు. ఏమిటి సంగతి అని పక్కతన్ని అడిగాను.

"మీకింకా తెలియదా....! అయ్యో... ఆ రామకృష్ణ మనల్నందరినీ మోసం చేసి డబ్బుతో సహా పరారైపోయాడు. నిన్న రాత్రికి రాత్రే ఉడాయించాడట..." అన్నాడు. నాకు గుండెఆగినంత పనైంది.

నమ్మకం కుదరక గుంపులోకి వెళ్ళేసరికి మధ్యలో పోలీసులు, పత్రికా ఫొటోగ్రాఫర్లు... హడావుడి చేస్తూ కనబడ్డారు. వాళ్ళు కూడా ఆమాటల్నే ధృవపరిచారు.

ఉన్న పదివేలూ పోయాయి. ఇక మిగిలిందల్లా చేతిలో పని చెయ్యని గడియారం! కడుపులో బాధను దిగమింగుకొని ఒక వాచ్ షాపుకు వెళ్ళాను. షాపువాడు అంతా విప్పదీసి -

"ఇదెక్కడ కొన్నారు సార్... ఒక్క పార్టూ సవ్యంగా లేదు..." అన్నాడు.

"అదేమిటయ్యా అది కొత్తదైతేనూ..." అన్నాను.

"లేదు సార్... ఇక ఇది ఎందుకూ పనికిరాదు... ఎవరో మిమ్మల్ని బాగా మోసం చేశారు" అన్నాడు. నా తల దిమ్మెక్కుతుంటే రామకృష్ణ మాటలు గుర్తొచ్చాయి.

"మోసపోయేవాళ్లు వుంటేనే కదా మోసగాళ్ళు తయారయ్యేది...! అందుకే మోసగాళ్ళను కనిపెట్టి వాళ్ళకి దూరంగా వుండటం ఎంతో అవసరం... అది కూడా ఒక కళే ననుకోండి..."

వినియోగదార్లందరూ గుర్తుంచుకోవాల్సిన 'వినియోగ గీత' యిది! ❑

## పిల్లల పెంపకం

# పిల్లలూ - భయాలూ!

ఈ సృష్టిలోని ప్రతి ప్రాణీ ఎప్పుడో ఒకసారి ఏదో ఒక సందర్భంలో దేనికో దానికి భయపడటం అన్నది సహజం. పిల్లిని చూసి చిట్టెలుక, కుక్కని చూసి పిల్లి, మనిషిని చూసి కుక్క, ఉరుములు మెరుపుల్ని చూసి మనిషి భయపడటం ప్రకృతి సహజం!

ఒక విధంగా చెప్పాలంటే భయాన్ని కలిగి ఉండటం మంచి లక్షణం. భయం వుండటం వల్లనే జంతుకోటి తమని తాము రక్షించుకోగలుగుతున్నాయి. పిల్లలైనా, పెద్దలైనా అప్పుడప్పుడు భయానికి గురికావడం అవలక్షణమేమీ కాదు. భయంకరమైన విస్ఫోటాన్ని విన్నప్పుడు, సెగలు కక్కుతున్న అగ్ని కీలలను చూసినప్పుడు 'నేనేమీ భయపడటం లేదని చెప్పడం అవివేకం! ఇలాంటి సందర్భాల్లోనే భయం అనే లక్షణం మనల్ని ఈ ప్రమాదాల్ని నుంచి దూరంగా పారిపోయేట్లు చేసి తద్వారా మనకి ప్రాణరక్షణ కల్గిస్తోంది.

కానీ ప్రతి చిన్న విషయానికి భయపడటం మనకి మంచిని చేయకపోగా కీడునే చేస్తుంది. కుక్క అరుపు



విన్నంత మాత్రాన భయపడనవసరమేమీ లేదు. అలాగే కొంతమంది చీకటంటే విపరీతంగా భయపడిపోతూంటారు. కానీ ఈ ప్రపంచం, రోజులో సగం కాలం చీకటిగానే వుంటుంది కదా! చీకట్లు ముసురుతూ రాత్రయిన తర్వాత, పగలంతా తిండి కోసం శ్రమించిన జీవరాశికి ప్రశాంతమైన విశ్రాంతితో కూడిన నిద్ర దొరుకుతుంది.

చాలామంది పిల్లలు తమ తల్లిదండ్రులను గమనించడం ద్వారానే భయపడటం నేర్చుకుంటారు. కాబట్టి తమ పిల్లలు చీటికి మాటికి భయపడకుండా వారికి ధైర్యాన్ని నూరి పోయాల్సిన బాధ్యత ఖచ్చితంగా పెద్దలదే!

**చీకటంటే భయం :**

చీకట్లో అమ్మానాన్న కనిపించక పోవడం చేత వాళ్లు తమని వదలి వెళ్లిపోయరేమోననే, చీకటంటే పసిపాపలు భయపడ్తారని పరిశీలకులు చెప్తున్నారు. ఈ భయమే పిల్లలో పెద్దయిన తర్వాత కూడా వాళ్లని వెంటాడుతూంటుంది.

ఇందుకు తల్లిదండ్రులు పిల్లలకు నిద్రాభంగం కలిగించనంతమేరకు కాంతి వెదజిమ్మేలా లైట్లను ఏర్పాటు చేసుకోవాలి.

**జంతువులంటే భయం :**

పిల్లలకు జంతువులంటే భయం వుండటం ఒకందుకు మంచిదే అయినా పెంపుడు జంతువులైన పిల్లిని, కుక్కని చూసి భయపడేలా వాళ్లని తయారుచేయ కూడదు. పిల్లలు ఈ విధంగా భయపడ్తున్నప్పుడు మొదట వారిని పిల్లి కూనలతో, కుక్క పిల్లలతో ఆడుకునేట్లుగా అలవాటు చేయాలి. స్వభావరీత్యా ఈ జంతువులు కాస్త సహన గుణం గలవి కాబట్టి, పిల్లలు ఆటకాయితనంగా వాటిని గట్టిగా లాగినా కరవ్వు.

కాలక్రమేణా మిగతా పెంపుడు జంతువులపై పిల్లలు కారుణ్య దృష్టి కలిగి, జంతువులంటే అనవసరమైన భయానికి గురికారు.

**క్రిమి కీటకాదులంటే భయం :**

తేనేటీగలు, కందిరీగలు, సాలెపురుగులు, మొదలైన కీటకాలను చూస్తే చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా అందరూ భయపడుతూండటం జరుగుతూంటుంది. దోమలు తప్ప మిగతా కీటకాలన్నీ మనం వాటికి ఏదైనా హాని తలపెడితే తప్ప మనజోలికి రావు. అయితే ఎప్పుడైనా అవి మనల్ని కుడితే ప్రాణం పోయేంతగా పెద్ద ప్రమాదమేమీ జరగదు. ఈ విషయం పిల్లలకి అర్థమయ్యేలా చెప్పాలి.

**దెబ్బ తగులుతుందేమోనని భయం :**

చాలా మంది పిల్లలు ఆడుకునేప్పుడు దెబ్బలు తగులుతాయనే భయంతో ఆట పాటలకు దూరమవుతూంటారు. అయితే ఆటలలో తగిలిన చిన్న చిన్న గాయాలు వెంటనే మానిపోతాయి. కాళ్ళు, చేతులు బెణకడం కూడా త్వరగా నయమవుతాయి.

ఇటీవల జరిపిన ఓ సర్వేలో టీ.వి. కార్యక్రమాలచే ప్రభావితులైన పిల్లలు ఆ రీతిలోనే హింసాయుతమైన ముష్టిముద్దాలకు దిగుతున్నట్లు తెలిసింది. అయితే సినిమాలలో కన్పించేదంతా నటన అని పిల్లలకు విడమర్చి చెప్పాల్సిన బాధ్యత పెద్దలదే.